నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వైట్‌ఫీల్డ్ ఏఈ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీరాంనగర్ ఏ.బీ.సీ బ్లాక్‌లు, సీఎంసీ లేఅవుట్, కామ్లెట్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గచ్చిబౌలిలో..

మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చిత్రపురి కాలనీ, ఎంఐజీ, హెచ్ఐజీ బ్లాక్‌లు, సాయి ఐశ్వర్య కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ కొండాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో.. గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇండిస్ టవర్స్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఎస్.రంగారెడ్డి తెలిపారు.

చందానగర్‌లో..

చందానగర్: మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

◆ శాంతినగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి 11.00 గంటల వరకు శాంతినగర్, ఉషోదయ అపార్ట్‌మెంట్స్, ధర్మపురి టెంపుల్ రోడ్డు, దీప్తిశ్రీనగర్ ప్రాంతాలలో..

◆ వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో.. ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్‌లో ఉదయం 11.00 గంటల నుంచి 11.30 గంటల వరకు ఫ్రెండ్స్ కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా గుల్‌మొహర్‌పార్కు కాలనీ, ఆర్‌డీబీ ఫీడర్ల పరిధిలో.. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకట్‌నారాయణరెడ్డి తెలిపారు.

◆ 11 కేవీ గుల్‌మొహర్‌పార్కు కాలనీ, ఆర్‌డీబీ ఫీడర్‌ల పరిధిలో.. గుల్‌మొహర్‌పార్కు కాలనీ, నేతాజీనగర్, జీహెచ్ఎంసీ మున్సిపల్ ఆఫీస్ ఏరియా, ఆలింద్‌ కంపెనీ ఏరియా, ఆర్‌డీబీ అపార్టుమెంట్స్ ఏరియాల్లో విద్యుత్ ఉండదన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 15, పచ్చిమిర్చి 45, బెండ 50, కాకర 50, దొండ 45, దోస 40, ఆలు 30, చామ 50, కీర 30, బీర 55, వంకాయ 30, గోకర 50, బీన్స్ 50, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 30, చిక్కుడు 50, ఉల్లి 35(కేజీ), ములక్కాయలు (3) 20 .

నేడు మల్లికార్జునస్వామి-భ్రమరాంబమాత కల్యాణం

రాయదుర్గం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రాయదుర్గం మల్లికార్జునస్వామి ఆలయంలో మల్లికార్జునస్వామి–భ్రమరాంబతల్లి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం తెల్లవారుజామున 5 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఈ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారిని దర్శనానికి అవకాశం కల్పిస్తారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

హెచ్‌సీయూ జాయింట్ రిజిస్ట్రార్‌కు సన్మానం



బి.శ్రీనివాస్‌ను సన్మానించిన అసోసియేషన్ ఉద్యోగులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ జాయింట్ రిజిస్ట్రార్ బి.శ్రీనివాస్‌ను వర్సిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఉద్యోగుల సంక్షేమానికి, వారికి న్యాయం చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



గచ్చిబౌలి: గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సాయినాథ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నానక్‌రాంగూడ రోటరీ సమీపంలో ఓ వ్యక్తి(58) అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని ఈ నెల 11 ఉదయం 10.30 గంటలకు సమాచారం అందింది. ఒంటిపై గాయాలుండటంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. సంబంధిత వ్యక్తులెవరైనా ఉంటే 9490617127 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.



దీప్తిశ్రీనగర్‌లోని ధర్మపురిక్షేత్రంలో బారులు తీరిన భక్తులు





ఆదిభిక్షువుకి అభిషేకాలు

మహాశివరాత్రి... కిటకిటలాడిన శివాలయాలు • సాంస్కృతిక కార్యక్రమాలు.. జాగరణ





సాయిదత్తగణపతి ఆలయంలో..

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాలు కిటకిటలాడాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనానికి బారులు తీరారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, హఫీజ్‌పేట్, మియాపూర్, మాదాపూర్ డివిజన్లలోని శివాలయాలు, ఇతర ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, పంచామృతాభిషేకం, జలాభిషేకం, పాలాభిషేకం చేశారు. కొన్ని ఆలయాల్లో స్వయంగా భక్తులు శివుడికి అభిషేకం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. – శేరిలింగంపల్లిజోన్ బృందం



ఇందిరానగర్ శివాలయంలో శివయ్యకు అభిషేకం చేస్తున్న భక్తులు

శివతాండవం..

మాదాపూర్: శివరాత్రిని పురస్కరించుకుని బుధవారం శిల్పారామంలో నాట్యాంజలి ఉత్సవాన్ని నిర్వహించారు. సిద్ధ నాట్యకళాసమితి సుధామాల, రేణుకప్రభాకర్, చంద్రశేఖర్, అడపా భరణి, నళిని ఆధ్వర్యంలో గురువులు సుందరి రవిచంద్ర, డాక్టర్ పేరిణికుమార్, హైమావతి, జయకవి, శిరీష, బాలాజి, శ్రీవల్లిరావు, నివేదిత, శృతికిరణ్ శిష్యబృందాలు లింగాష్టకం, శివస్తుతి, భో శంభో, శివతాండవం, శంకర గిరిజపతి, గంగాధరవర, అంగీకారం భువనం, పంచమూర్తికౌతం, కాలభైరవాష్టకం తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించారు. యక్షగాన కంఠీరవ డాక్టర్ పసుమర్తి శేషుబాబు, నాట్యమయూరి డాక్టర్ సత్యప్రియ పాల్గొని గురువులను, కళాకారులను సత్కరించారు.





భెల్ టౌన్‌షిప్‌లో..



చందానగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శివుడికి అభిషేకం

• బీరంగూడలో..

పటాన్‌చెరు: మహాశివరాత్రి సందర్భంగా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంజీరనగర్ కాలనీలో గల శ్రీ మల్లికార్జునస్వామి– రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్న అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రామచంద్రాపురం పట్టణంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి బుధవారం పోలింగ్ సిబ్బంది, అధికారులు చేరుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి మాట్లాడుతూ 2,039 మంది పట్టభద్రుల ఓట్లకు గాను 3 పోలింగ్ కేంద్రాలు, 145మంది ఉపాధ్యాయుల ఓట్లకు గాను ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోలింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

క్రీడల్లో సత్తా చాటిన కేఎల్‌హెచ్ గ్లోబల్ విద్యార్థులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో పలు చోట్ల జరిగిన అంతర్ విశ్వవిద్యాలయ క్రీడా టోర్నమెంట్లలో కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ (కేఎల్‌హెచ్‌బీజీఎస్) విద్యార్థులు సత్తా చాటారు. మహీంద్రా విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లో బీబీఏ తొలి సంవత్సరం విద్యార్థి ఎస్.మహేష్, 3,000 మీటర్లు, 1,500 మీటర్ల రేస్‌లో బంగారు పతకాలు, మరో విద్యార్థి రాంరెడ్డి 800 మీటర్ల రేస్‌లో బంగారు పతకం గెలుచుకున్నాడు. స్కూల్ విద్యార్థినులు ప్రియాంక, జ్యోతిలు బాస్కెట్‌బాల్‌లో తమ జట్టును విజయపథంలో నడిపించారు. బిట్స్ పిలానీలో జరిగిన పోటీల్లో ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థిని వైష్ణవి పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణం సాధించగా, బీబీఏ రెండో సంవత్సరం విద్యార్థిని సంజన బ్యాడ్మింటన్‌లో స్వర్ణం సాధించింది. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కేఎల్‌హెచ్ జీబీఎస్ డైరెక్టర్ అకడమిక్స్ డాక్టర్ గాజులపల్లి రాధాకృష్ణ అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.



ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదవాలి

బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ రవికుమార్‌యాదవ్



విద్యార్థులకు చెక్కులు అందజేసిన బీజేపీ నాయకుడు రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ రవికుమార్‌యాదవ్ అన్నారు. ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మసీద్ బండలోని ప్రభుత్వ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బుధవారం ఆయన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఎంపీ సేవా కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, వసంత్‌యాదవ్, రామరాజు, వెంకటస్వామిరెడ్డి, మహేశ్‌యాదవ్, రాధాకృష్ణ యాదవ్, రాజేష్‌గౌడ్, లక్ష్మణ్, వంశీ పాల్గొన్నారు.

ఓల్డ్ ఏజ్ హోమ్ నుంచి మహిళ అదృశ్యం

చందానగర్: ఓల్డ్‌ఏజ్ హోమ్ నుంచి ఓ మహిళ అదృశ్యమైన సంఘటన చందానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా దోమ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మున్నూరు నర్సింహులు కుటుంబంతో కలిసి ఇంద్రానగర్‌లో నివాసముంటున్నాడు. అతని అమ్మ మున్నూరు సుజాత జవహర్‌నగర్ కాలనీలోని అమ్మానాన్న ఓల్డ్‌ఏజ్ హోమ్‌లో ఉంటోంది. ఈ నెల 25వ తేదీఈ సాయంత్రం 4.30 గంటలకు తన కుమారుడి ఇంటికి వెళుతున్నానని చెప్పి ఓల్డ్‌ఏజ్ హోమ్ నుంచి బయటకు వచ్చింది. కుమారుడికి ఇంటికి చేరకపోవడంతో స్నేహితులు, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం పోలీసులను ఆశ్రయించారు.

ముగిసిన చిత్రలేఖనం పోటీలు

మణికొండ: మహాశివరాత్రిని పురస్కరించుకుని మూడురోజుల పాటు కొనసాగిన చిత్రలేఖనం పోటీలు బుధవారం ముగిశాయి. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో కాశీపట్నం ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో శివోహం-9 పేరిట పోటీలను నిర్వహించారు. 25 మంది కళాకారులు మహాదేవుడి చిత్రాలను గీశారు. చివరి రోజు వారు గీసిన చిత్రాలను ప్రదర్శించారు.

9న జర్నలిస్టులకు ఉచిత వైద్యశిబిరం

ఆల్విన్‌కాలనీ: రాందేవ్‌రావ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మార్చి 9న జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకునే వారు మార్చి 5వ తేదీలోపు తమ పేరు, కుటుంబ సభ్యుల వివరాలు, పత్రిక పేరు, ఫోన్ నంబర్ నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ వైద్య శిబిరంలో గుండె, కిడ్నీ, లివర్, రక్త పరీక్షలు, ఎముకలకు సంబంధించిన పరీక్షలు, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్, మహిళలకు గైనిక్ పరీక్షలు సుమారు రూ. 30 వేల ఖర్చు అయ్యే వైద్య పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు.

దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని సుమిత్రనగర్‌లో సత్యవేద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకూ ఎండలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. రాకపోకలు సాగించే క్రమంలో నీళ్లకు ఇబ్బంది పడకుండా ఉండటానికి చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి పలు ప్రాంతాల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, పురేందర్ రెడ్డి, దొడ్ల రామకృష్ణ గౌడ్, కాశీనాద్‌యాదవ్, సత్యవేద ఫౌండేషన్ మేనేజర్ విజయకుమార్, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎడ్వర్డ్ రాస్, పాస్టర్లు మాణిక్యం, కొమ్ము సాగర్, దాసు, వినయ్, జాన్, రమేష్, రవి, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

పునఃప్రారంభం కానున్న రోడ్డు విస్తరణ పనులు

- త్వరలోనే 1.4 కిలోమీటర్లు 150 ఫీట్ల రోడ్డు విస్తరణ
- తీరనున్న 50 కాలనీల ప్రజల ఇబ్బందులు



చందానగర్ శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్‌కు వెళ్లే రోడ్డు



చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ కొన్ని అడ్డంకుల వల్ల నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఏళ్ళు గడుస్తున్నా రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మారిన నేపథ్యంలో శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ కమాన్ వరకు రోడ్డు విస్తరణపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. బీహెచ్ఈఎల్ వద్ద నిర్మించిన ఫ్లైఓవర్ దాదాపు పూర్తి అయింది. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుంది. చందానగర్ ముంబై జాతీయ రహదారి నుంచి శ్రీదేవి థియేటర్ మీదుగా అమీన్‌పూర్ కమాన్ వరకు ఆగిన పనులను ఆయన పర్యవేక్షించనున్నారని ప్రజాప్రతినిధులు తెలిపారు. గత 5 సంవత్సరాల క్రితం 2.2 కిలోమీటర్లు 150 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. తిరిగి రూ.45 కోట్ల నిధులు మంజూరు కావడంతో త్వరలోనే పనులు ప్రారంభం కానుండడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

◆ చందానగర్, అమీన్‌పూర్ పరిసర ప్రాంతాలలో కాలనీలు, అపార్ట్‌మెంట్లు రోజురోజుకు పెరుగుతున్నాయి. భారీ జనావాసాలు రావడంతో వాహనాల రద్దీ పెరిగింది.

◆ శ్రీదేవి థియేటర్ వద్ద కల్వర్టు పనులకు రూ.1.98 కోట్లతో పనులు పూర్తి

◆ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల తొలగింపు కోసం రూ.1.68 కోట్లు విద్యుత్ శాఖ అందించింది. ఆ పనులు కూడా దాదాపు పూర్తి కావొచ్చాయి.

◆ రోడ్డు విస్తరణ అసంపూర్తిగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది.

◆ రోడ్డుపై కూరగాయల సంత, చిరు వ్యాపారాలతో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయి.





రోడ్డు విస్తరణలో భాగంగా శ్రీదేవి థియేటర్ వద్ద పూరైన కల్వర్టు

త్వరలో రోడ్డు విస్తరణ పనులు

శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణలో కొంత మేర పనులు పూర్తి అయ్యాయి. మరికొంత మేర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తొలగింపు ప్రక్రియ తుది దశకు చేరాయి. త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తాం. గత జోనల్ కమిషనర్ రూ.2 కోట్లు నిధులకు రోడ్డు విస్తరణకు విడుదల చేశారు. రోడ్డు విస్తరణ త్వరతగతిన పూర్తి చేస్తాం.

– కెవిఎస్ఎస్. రాజు, ఈఈ, సర్కిల్ 21

అసంపూర్తి పనులు పూర్తి చేయిస్తాం

రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడంతో అనేక సార్లు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటి సమావేశంలో ప్రస్తావించాను. ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీతో కలిసి జీహెచ్ఎంసీ కమిషనర్, రాష్ట్ర మంత్రులను కలిసి నిధులు మంజూరు చేయించాం. అసంపూర్తిగా ఉన్నా రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభించి యుద్ధప్రాతిపదికన పనులు చేపడతాం.

– మంజుల రఘునాథ్‌రెడ్డి, చందానగర్ కార్పొరేటర్